


# కాన్ కరేలా

## సూర్యచంద్రుల గ్రహణం కథ

ఒక రాణిగారు గర్భంతో ఉంది.

ఒకనాడు మహల్‌లో నిలబడి బయటికి చూస్తూ వుంటే ఒక కాకి బాగా పండిన ఎర్రటి కాకరకాయని తింటా కనిపించింది. ఆ కాకరకాయ మీద రాణికి మనసుపోయింది. కొంచెం అన్నా మిగులుతుందేమో తిందాము అని చూస్తుండేసరికి కాకి మొత్తం కాకరకాయని తినేసి ఎగిరెళ్లిపోయింది.

గర్భంతో వున్న ఆడది. లోన కోరిక పుట్టింది. అది తీరలేదు. అందుకని వొళ్లంతా వాపు వచ్చేసింది.

'మహరాణి మనసులో ఏదో కోరిక పెట్టుకున్నారు. అందుకే వాపు వచ్చింది. వాపు తగ్గకపోతే కాన్పు ప్రమాదం' అన్నారు వైద్యులు.

'రాణిగారూ. ఏంటి సంగతి. మీ కోరికేమిటో నాకు చెప్పండి. ఎంత కష్టమైనదైనా తీరుస్తాను' అన్నాడు రాజు.

రాణిగారు విషయమంతా చెప్పి 'నాకు అలాంటి కరేలా (కాకరకాయ) తినాలని వుంది' అని వెల్లడి చేసింది.

రాజు యింక గుర్రం తీసుకొని బయలుదేరాడు. పోంగా పోంగా చాలా దూరాన ఒకచోట ఒక కాకరపాదు కనిపించింది. దానికి కనీవినీ ఎరగనంతటి రీతిలో ఎర్రటి కాకరకాయలు కనిపించాయి. రాజు వెళ్లి ఒక కాకరకాయను కోస్తుంటే మడుగులో నుండి నాగుపాము వచ్చింది.

'రాజా. ఈ మడుగు నాది. ఈ చెట్టు నాది. నేనడిగింది యిచ్చి నీకు కావలసింది తీసుకుపో' అంది.

'ఏం కావాలి?' అన్నాడు రాజు.

'మగపిల్లాడు పుడితే నీకు. ఆడపిల్ల పుడితే నాకు' అంది పాము.

అప్పటి సంగతి అప్పుడులే అనుకున్న రాజు 'అలాగే' అని చెప్పి కాకరకాయలు కోసుకొని వచ్చేశాడు. రాణి వాటిని తినింది. వాపు తగ్గింది. కాన్పు జరిగింది. ఆడపిల్ల పుట్టింది. రాజుగారి గుండెల్లో రాళ్లు పడ్డాయి. సరే పాము వచ్చినప్పుడు చూసుకుందాంలే అనుకుంటూ వుండగా మళ్లీ కాన్పు జరిగి ఒక అబ్బాయి పుట్టాడు.

అమ్మాయికి పన్నెండేళ్లు రాగానే ఒకరోజు పాము రాజును వెతుక్కుంటూ వచ్చింది. నీ కూతుర్ని యిస్తావా యియ్యవా? అని నిలదీసింది. రాజు యింకేమీ చేయలేక అమ్మాయిని పాము చేతుల్లో పెట్టాడు. పాము ఆ అమ్మాయిని తీసుకెళ్లి మడుగులో కాపురం పెట్టింది.

సరే యీ అమ్మాయికి ఒక తమ్ముడు వున్నాడు గదా. వాడు పెరిగి పెద్దవాడవుతున్నాడు. ఒకరోజు వాడు తోటి పిల్లలతో ఆడుకుంటూ ఎవర్నో తన్నాడు. దాంతో వాడికి కోపం వచ్చి 'యిందుకని గదరా మీ అక్కను పాము తీసుకెళ్లింది' అన్నాడు. ఆ మాటకు తమ్ముడు నోరెళ్లబెట్టాడు. వెళ్లి తండ్రిని సంగతి అడిగాడు.

'అవును నాయనా. ఫలానా సమయంలో ఫలానా విధంగా జరిగింది. ఫలానా రోజు వచ్చి ఆ పాము మీ అక్కను తీసుకువెళ్లింది' అని

చెప్పాడు రాజు.

'నువ్వు బాధపడబాకు అబ్బా. నేను అక్కను తీసుకొస్తాను' అని చెప్పి, కత్తులు కటార్లు బాణాలు బరిసెలు తీసుకొని వెళ్లాడు తమ్ముడు. వెళ్లి సరాసరి మడుగులో దూకాడు.

అక్కడ అక్క కనిపించింది. 'ఎవరు నాయనా నువ్వు?' అని అడిగింది.

'అక్కా నేను నీ తమ్ముణ్ణి! నిన్ను తీసుకెళ్లడానికి వచ్చాను' అన్నాడు తమ్ముడు.

'నన్ను యింకేం తీసుకెళతావు నాయనా. మీ బావ నాతో కాపురం చేస్తున్నాడు. నేనిప్పుడు గర్భంతో వున్నాను. నన్ను తీసుకెళ్లి కూడా ప్రయోజనం లేదు' అంది అక్క ఏడుస్తూ.

'ఏం పరవా లేదక్కా. నేను నిన్ను తీసుకెళతాను' అని అన్నాడు తమ్ముడు.

'ఆ సంగతి తర్వాత యిప్పుడాయన అన్నానికి వచ్చే టైము' అని చెప్పిన అక్క, తమ్ముణ్ణి బల్లిలా చేసి గోడకు అంటించి కూర్చుంది.

కాసేపటికి ఫన్‌ఫనామంటూ బుసలు కొడుతూ వచ్చింది పాము. వచ్చి పీకల్దాక మెక్కి వెళ్లిపోయింది.

గోడ దిగిన తమ్ముడు 'అక్కా. యిలాకాదు. పొయ్యిలో కట్టెలు రాజేసి వేడినీళ్లు పెట్టు. బాగా మరగనివ్వు. రాత్రికి వాడొచ్చి చుట్టచుట్టుకొని పడుకుంటాడు గదా. దబర తీసుకెళ్లి చుట్ట మీద పెట్టెయ్. చచ్చిపోతాడు' అన్నాడు.

అక్క అలాగే చేసింది. రాత్రి పాముచ్చి చుట్టచుట్టుకొని పడుకోగానే కాలేకాలే నీళ్లున్న దబరను తీసుకొచ్చి దాని చుట్ట మీద పెట్టింది.

భగ్గున చుట్ట కాలినా పాము ప్రాణాలు పోలా.

'నేను చచ్చినా రేపు నా బిడ్డలు నిన్నూ నీ తమ్ముణ్ణి చంపుతారు చూడు' అని ప్రాణాలు విడిచింది. వెంటనే అక్కను తీసుకొని బయలుదేరాడు తమ్ముడు. అడవిదారి. సగానికి వచ్చేసరికి అక్కకు నొప్పులు బయలుదేరాయి. కాన్పు జరిగింది. పాముపిల్ల పుట్టింది. దానిని చంపేశాడు తమ్ముడు. మళ్లీ కొంచెం దూరం వెళ్లాక మళ్లీ నొప్పులు వచ్చాయి. మళ్లీ పాము పిల్ల పుట్టింది. దానిని కూడా చంపేశాడు తమ్ముడు. అలా గడియ గడియకు నొప్పులొచ్చి, గడియ గడియకూ కాన్పు జరిగి పాము పిల్లలు పుడుతుంటే వాటన్నింటిని చంపుకుంటూ వస్తున్నాడు తమ్ముడు.

యింక ఊరు దగ్గర పడ్తోందనగా ఆఖరి కాన్పు అయ్యింది రాణికి. ఆఖరి పాముపిల్ల పుట్టింది. దానిని తమ్ముడు చంపేటంతలో అది సరసరమని పారిపోయింది. తమ్ముడికి చెమటలు పట్టాయి. గునపం తీసుకొని అటూ యిటూ తవ్విందే తవ్వుతున్నాడు దానిని చంపడానికి. అది దొరకడం లేదు.

సరిగ్గా అప్పుడే ఆ దోవన అన్నదమ్ములైన సూర్యచంద్రులు పోతా వున్నారు. కింద తమ్ముడు చేస్తున్న ఈ పనిని చూశారు. చూసి కిందకు దిగారు. 'ఏమోయీ. ఏమి నువ్వు చేస్తున్న పని?' అని అడిగారు,

తమ్ముడు సంగతంతా చెప్పుకొచ్చాడు. సూర్యచంద్రులు నవ్వారు. నవ్వి 'అది యిప్పుడు పసి పాము. పెరిగి పెద్దదయ్యి నిన్నూ, నీ అక్కనూ చంపడానికి వచ్చినప్పుడు చూసుకుందాం. అప్పటికి కూడా నీకు ప్రమాదం ఏర్పడితే మేము అడ్డుపడతాం పో' అని మాటిచ్చారు.

సరే అని అక్కాతమ్ముళ్లు వెళ్లిపోయారు. పన్నెండేళ్లు గడిచిపోయాయి. ఆఖరి పాము పెద్దదయ్యింది. ఫన్‌ఫనామని బుసలుకొడుతూ పగ తీర్చుకోవడానికి బయలుదేరింది. మళ్లీ ఆ టైములో అటుగా వెళుతున్న సూర్యచంద్రులు యిది చూసి కిందకు దిగి వచ్చారు.

'ఎక్కడికి వెళుతున్నావు?' అని అడిగారు పాముని.

'నేను ఫలానా అక్కాతమ్ముళ్లని చంపడానికి వెళ్తున్నాను. వాళ్లు మా నాన్నను చంపారు' అంది పాము.

సూర్యచంద్రులు ఆ పాముని శాంతింపజేశారు.

'ఒరి పిచ్చివాడా. ఏనాడో జరిగిపోయిన సంగతికి యింకా నువ్వు పగ పెట్టుకొని వున్నావా? మీ నాన్న చేసిన పనికి వాళ్లు అలా బదులు తీర్చుకున్నారు. సరే. యింకా నీకు కోపం వుంటే మా మీద పగ తీర్చుకో. ఏడాదికోసారి మమ్మల్ని మింగు కక్కు. సరేనా' అన్నారు.

సరే అంది పాము.

అప్పటి నుంచి ఆ పాము ఏడాదికోసారి సూర్యుణ్ణి, చంద్రుణ్ణి మింగుతూనే వుంది. అదే సూర్యగ్రహణం, అదే చంద్రగ్రహణం.

✪ ఈ కథను కావలి 'కసాబ్‌గల్లీ'లోని ఖుర్షీద్‌బి అనే ఆవిడ చెప్పింది. ఆమె సొంత ఊరు కావలికి దగ్గరగా వున్న 'ముంగమూరు'. ఆ ఊరికి ఆమె బాల్యంలో పూసలు అమ్మే 'సుక్క బూబమ్మ' అనే ముసలామె వచ్చేదంట. ఆమె ఆ కథను చెప్పిందంట.